## క్లుప్తంగా

### పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

మురళీనగర్: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష పాలిసెట్‌కు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్‌లో విశేష అనుభవమున్న వీటీబీ పట్నాయక్ ఈ తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు రాసినవారు, గతంలో పరీక్ష పాసైన వారు పాలిసెట్ కోచింగ్‌లో చేరవచ్చని తెలిపారు. ఏప్రిల్ 7నుంచి 20వ తేదీ వరకు రోజూ ఉదయం 10.30గంటల నుంచి 12గంటల వరకు తరగతులు ఉంటాయని తెలియజేశారు. వివరాలకు 99660 78056 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు


ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ఆఖరి శుక్రవారం కావడంతో మద్రిపాలెం జాకీర్ హుస్సేన్ నగర్ మసీద్–ఈ–అల్ ఖదీర్ వద్దకు ముస్లింలు చేరుకుని పవిత్ర జుమా నమాజ్‌ను ఆచరించారు. హఫీజ్(మత గురువు) ఖురాన్ పఠించి, అందులో సూక్తులను వివరించారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్‌కు ముందు జాకీర్ హుస్సేన్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలు పాల్గొని, దీక్షను విరమించారు. కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

### గైస్ లెక్చరర్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు



అవార్డు సర్టిఫికెట్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగం సీనియర్ లెక్చరర్ డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. పరిశోధనలో ప్రతిభ ఆధారంగా మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్, నీతి ఆయోగ్ గుర్తింపు పొందిన వెలెరిడ్ ఫౌండేషన్ సంస్థ ఈ అవార్డును ఆమెకు ఆన్‌లైన్‌లో ప్రదానం చేసినట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ప్రశాంతకుమారికి అభినందనలు తెలిపారు.

### 'కొసనా'కు నివాళి


కొసనా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న స్వర రంజని సభ్యులు

సీతంపేట: కళలకు, కళాకారులకు కొసనా చేసిన సేవలు నిరుపమానమని స్వర రంజని సభ్యులు కొనియాడారు. కొసనా 5వ వర్ధంతి సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్వర రంజని అధ్యక్షుడు లతా రాములు, గౌరవాధ్యక్షు డు లక్ష్మీ ప్రసాద్, గౌరవ సలహాదారు పద్మిని, సహాయ కార్యదర్శి రూపవాణి, ప్రధాన కార్యదర్శి కోరుకొండ రంగారావు తదితరులు మాట్లాడుతూ కొసనాతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వర రంజని సభ్యులు పాడిన లలితగీతాలు అలరించాయి.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో పార్కులకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మురళీనగర్ స్కేటింగ్ పార్కు, బృందావన్ పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు, వాకింగ్‌ట్రాక్‌లు, చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు, పెయింటింగ్ పనులకు సంబంధించి శంకుస్థాపన చేసిన ఆయన, రూ.53.35లక్షలతో ఈ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మాధవధార భజన కళాకారులకు సామాజిక భవనం ఏర్పాటు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జోన్–5 జెడ్సీ బి.రాము, వైఎస్సార్‌సీపీ నాయకుడు రొంగలి జగన్నాథం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తం


సీతమ్మధార రైతుబజారు వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు


ఆటోలు, ద్విచక్రవాహనాల పార్కింగ్

- ఇదీ సీతమ్మధార రైతుబజార్ దుస్థితి
- కానరాని ట్రాఫిక్ పోలీసులు
- రోడ్డుపైనే వాహనాలు


రైతుబజారు ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలు

సీతమ్మధార: నగరంలోనే పెద్ద రైతుబజార్లలో సీతమ్మధార రైతుబజార్ ఒకటి. కాని వాహనాల పార్కింగ్‌కి మాత్రం మోక్షం కలగడం లేదు. ఇతర బజార్లలో పార్కింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఇక్కడ మాత్రం సీన్ రివర్స్ అన్నట్టుగా ఉంది. రోడ్డు మీదే వాహనాల పార్కింగ్ కారణంగా ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఇక్కడ 1999లో రైతుబజార్ నిర్మించారు. ఈ బజార్‌లో రోజూ ఉదయం 140 మంది రైతులు, సాయంత్రం 60 మంది రైతులు కూరగాయలు విక్రయిస్తారు. ప్రతి రోజూ ఈ బజారులో సగటున ఐదు టన్నుల మేర కూరగాయలు విక్రయిస్తారు. ఈ బజార్‌కి సీతమ్మధార, కేఆర్‌ఎం కాలనీ, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్, రాధాకృష్ణ లేఅవుట్, మద్దిలపాలెం, భానునగర్, హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, పాత వెంకోజీపాలెం, పాత, కొత్త రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గురుద్వారా, శాంతినగర్, సీతమ్మపేట తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రజలు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇక్కడ పార్కింగ్ వెసులుబాటు లేకపోవడంతో బజారుకి రెండు వైపులా రోడ్డు మీదే వాహనాలు పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బజారు బయట ఒకవైపు తోపుడు బళ్లు, మరో వైపు వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ జామ్ అవుతున్నా ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు మాత్రం కానరాకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా పండగల సమయంలో అయితే ఇక చెప్పనక్కరలేదు. ఈ మార్గంలో 69 నంబర్ సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ఇంకా ఇతర వాహనాల రాకపోకలతో నిత్యం ఈ మార్గం రద్దీగా ఉంటుంది. బజారు బయట దుకాణాలు, వాహనాల పార్కింగ్ కారణంగా బజారు రోడ్డులోనే గల ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్ వసతిగృహానికి సిబ్బంది, ఉద్యోగినులు కూడా రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. బజారు లోపలికి వెళ్లేందుకు గల రెండు ప్రవేశద్వారాలకు అడ్డంగా నేల దుకాణాలు, వాహనాల పార్కింగ్ ఆటంకంగా మారడంతో వినియోగదారులు బజారు లోపలికి, బయటకి రావడానికి అవస్థలు పడాల్సి వస్తుంది.

**తోపుడుబళ్లతో అవస్థలు..**

బజారు బయట అధిక సంఖ్యలో తోపుడు బళ్ల ద్వారా పళ్లు, కూరగాయల వ్యాపారాలు సాగుతున్నాయి. కొన్ని తోపుడుబళ్లు వినియోగంలో లేకున్నా అలాగే ఉంచుతున్నారు. జోన్–3 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. తోపుడు బళ్ల వద్దనే వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ సమయంలో హారన్ల మోతతో ఈ ప్రాంతం మార్మోగిపోతోందని స్థానికులు, పాదచారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, మార్కెటింగ్ శాఖ స్పందించి పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

**అధికారులకూ తప్పని తిప్పలు**

జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు తరచూ బజారు తనిఖీ నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. ఆ సమయంలో డిప్యూటీ డైరెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చే వాహనాలు నిలపడానికి కూడా ఇక్కడ పార్కింగ్ స్థలం లేదంటే అతిశయోక్తి కాదు. ఏదో మారుమూల వాహనం ఆపి అధికారి బజారులోపలకి రావల్సిన పరిస్థితి నెలకొంది. రైతుబజార్ సిబ్బంది, వ్యాపారులకు కూడా వాహనాల పార్కింగ్ పెద్ద ప్రహసనంగా మారిందంటే అతిశయోక్తి కాదు. అలాగే సబ్సిడీ టమాటా విక్రయాల సమయంలో వినియగదారుల సంఖ్య బాగా పెరుగుతుంది. ఆ సమయంలో ఇక వాహనాల పార్కింగ్ సమస్య వర్ణనాతీతం అన్నట్టుగా ఉంటుంది.

**హోమ్‌గార్డుని ఏర్పాటు చేయాలి..**

సీతమ్మధార రైతుబజార్ బయట నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ మార్గంలో వచ్చే 69 నంబర్ సిటీబస్సుల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతోంది. ఇక్కడ ఎంవీపీ స్టేషన్ నుంచి కనీసం హోమ్‌గార్డుని ఏర్పాటు చేసేలా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రామారావు, బాలయ్యశాస్త్రి లేఅవుట్.

**పార్కింగ్ క్రమబద్ధీకరించాలి..**

సీతమ్మధార రైతుబజార్ వద్ద పార్కింగ్ ప్రదేశం లేక వినియోగదారులకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. బజారు బయట వినియోగంలో లేని తోపుడు బళ్లను వెంటనే టౌన్ ప్లానింగ్ విభాగం తొలగించాలి. ప్రభుత్వం స్పందించి బజారు బయట పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలి.

– బి. సింహాచలం, సీతమ్మధార.

## క్రీస్తుయందు భయభక్తులు కలిగి జీవించాలి


శిలువ మార్గం చూపిస్తున్న ఫాదర్లు

కంచరపాలెం: క్రీస్తు యందు భయభక్తులు కలిగి జీవించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ అన్నారు. పాస్కా కాలం 3వ శుక్రవారాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణగిరిలో పరిశుద్ధ శిలువ మార్గాన్ని ఘనంగా నిర్వహించారు. క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం దివ్యబలిపూజ నిర్వహించారు. ఏప్రిల్ 18న జరగనున్న గుడ్‌ఫ్రైడే వేడుకలకు రక్షణగిరిని ముస్తాబు చేస్తున్నట్లు కమిటీ నిర్వాహకుడు బేతా జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

## దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

సీతమ్మధార: నగదు అడిగినందుకు జర్నలిస్టులమని చెప్పి ఐస్ క్రీం దుకాణదారునిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై ఫోర్తుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. శుక్రవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు అక్కయ్యపాలెంలో గల ఐస్‌క్రీం పార్లర్‌కు వెళ్లారు. తిన్న ఐస్ క్రీమ్‌కి డబ్బులు అడిగినందుకు రిపోర్టర్‌ని అంటూ సిబ్బందిపై దాడి చేశారు. కొద్ది సేపటికి అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితులు ఫోర్తుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా అక్కయ్యపాలెం నందగిరినగర్‌కు చెందిన హరి, కైలాసపురానికి చెందిన వేణును అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

## నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం చదివి వినిపిస్తారన్నారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారన్నారు. 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగనివేదన ఉంటుందన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే సురక్షితమైన మనుగడ


కళాశాల విద్యార్థినులతో గ్రీన్ క్లైమేట్ సంస్థ సభ్యులు

కంచరపాలెం: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని గ్రీన్ క్లైమేట్ టీంఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి ఎకో వారియర్ జె.వి.రత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ మాణిక్య కుమారి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలో అమలవుతున్న ఎకో వైజాగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. భూమి మీద ఏ జీవి అంతరించినా దాని ప్రభావం మానవాళి మీదే పడుతుందని హెచ్చరించారు. వేసవిలో మనం ఆహారంగా తీసుకునే దేశీయ పండ్ల విత్తనాలు సేకరించి విత్తన బంతులు తయారు చేసి సామాజిక వనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు డాక్టర్ ఎస్.నాగరాజు, డాక్టర్ ఎం. పద్మ సుందరి, డాక్టర్ పి.కె. జయలక్ష్మి, గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ ప్రెసిడెంట్ కె.ప్రీతి, సెక్రటరీ ఎన్. మానస, ఎ.సంజన, ఎస్.లక్ష్మీకీర్తన తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


కప్పరాడ యూపీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జాతీయ, రాష్ట్ర ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు వైద్యులకు సూచించారు. కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు క్షేత్ర స్థాయిలో సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్దేశించిన పథకాలను వివరించారు. సాధారణ ప్రసవాలు, సర్వేలు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజకవర్గం ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయంలోని ఉత్తర నియోజకవర్గంలోని 14వ వార్డు ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన గుడివాడ హరిహర నాగరాజు రమేష్‌కు రూ.3 లక్షల 3 ఆరు వేల 778, నార్త్‌ఎక్స్‌టెన్షన్‌కు చెందిన శోభారాణికి రూ.37 వేలు, 25వ వార్డు హరిజన వీధికి చెందిన మాదాభక్తుల తులసీలక్ష్మికి రూ. 37 వేల 378, 42 వార్డుకు చెందిన ఆలమూరి శ్రీలతకు రూ.42 వేల 378, 44వ వార్డుకు చెందిర రమాదేవికి రూ. 30 వేలు, 46వ వార్డుకు చెందిన వై.కనకరాజుకు రూ.38 వేల 541, 47వ వార్డుకు చెందిన కె.రాజుకు రూ.14 వేల 884, 51వ వార్డుకు చెందిన వి.నిర్మల గాంధీకి రూ.25 వేల 655 నగదుకు సంబంధించిన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరు అనారోగ్యం పాలైనా ఆస్పత్రుల ఒరిజినల్ బిల్స్ పెట్టాలని సూచించారు. తద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నజీర్, నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై కమిటీ ఏర్పాటు చేయాలి


చర్చల్లో పాల్గొన్న యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్) డి. శ్రీనివాసులు ఉక్కు యాజమాన్యానికి సూచించారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నోటీసుపై శుక్రవారం సాయంత్రం నగరంలో ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు, కాంట్రాక్టర్లతో డీసీఎల్ సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమ తొలగింపులు ఆపాలని, 45 ఏళ్లు దాటిన వారికి వైద్య పరీక్షలు రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై డీసీఎల్ మాట్లాడుతూ కార్మికుల తొలగింపుపై కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాలు, యాజమాన్యం ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. పని లేదని తొలగించిన కార్మికులను ఒక పూల్‌గా ఏర్పాటు చేసి తిరిగి పని వచ్చినప్పుడు వారినే తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 7న తదుపరి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో రీజనల్ లేబర్ కమిషనర్ మొహంతి, యాజమాన్య ప్రతినిధులతో పాటు కాంట్రాక్టర్ల సంఘం నాయకులు బొడ్డ సన్యాసిరావు, అప్పలనాయుడు, కార్మిక సంఘాల నాయకులు కె.ఎం. శ్రీనివాస్, నీరుకొండ రామచంద్రరావు, జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, సత్యారావు, వంశీకృష్ణ, గుర్నాథ్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి


మరణించిన మహిళ

తాటిచెట్లపాలెం: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2వ తేదీన సుమారు 63 సంవత్సరాల వయసు గల తలకు గాయాల పాలై ఉన్న మహిళను రైల్వే భద్రతా దళం పోలీసులు 108 సహాయంతో కేజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుండి ఈమె చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఈమె సుమారు 5 అడుగుల ఎత్తు, తెలుపు, నీలం రంగు నైటీ ధరించి ఉంది. ఈమె వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. ఎస్ఐ కె. శాంతారా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా లేదా 7673906010 నెంబర్లలో తెలియజేయాలని కోరారు.

## పోక్సో కేసుల్లో శిక్షలు కఠినం


మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శ్రీ సత్యాదేవి

సీతంపేట: చట్టాలు చాలా కఠినంగా ఉంటాయని, తప్పు చేస్తే దాని పర్యవసానం జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని 11వ అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీ సత్యాదేవి అన్నారు. పోక్సో చట్టంపై సీతంపేటలోని శ్రీవిశ్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలబాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి పోక్సో చట్టం తీసుకువచ్చినట్లు చెప్పారు. పోక్సో కేసులో జీవిత ఖైదు, 20 ఏళ్ల వరకు శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ద్వారకా సబ్ ఇన్‌స్పెక్టర్, శ్రీవిశ్వ విద్యాసంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## ముగిసిన హిందీ రచయితల జాతీయ శిబిరం


ముగింపు శిబిరంలో ప్రశంసాపత్రాలతో అతిథులు, శిక్షకులు, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ నిదేశాలయం, న్యూఢిల్లీ సౌజన్యంతో హిందీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన 8 రోజుల నవ రచయితల శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా కేంద్రీయ హిందీ సంస్థాన్‌కు చెందిన రామదాస్ నారాయణ తోండే, డాక్టర్ పురుషోత్తమ్ పాటిల్ సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. భాషాభివృద్ధిని ప్రోత్సహించడం, కొత్త రచయితలకు ప్రచురణ అవకాశాలతో పాటు మార్గదర్శకత్వం అందించడం ధ్యేయమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, కన్వీనర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి నేతృత్వంలో భాషా సంపుటిని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. రచయితల్లో సృజనాత్మకతను, సొంత శైలిని అభివృద్ధి చేసి వారి భావాలను సరైన విధంగా వ్యక్తీకరించేందుకు మార్గదర్శనం చేయడంతో పాటు విద్యార్థులకు హిందీ భాషపై పట్టు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ నళినీ దత్త, డాక్టర్ అర్చన, డాక్టర్ ఎస్ దీప్తి, డాక్టర్ విజయభారతి, డాక్టర్ కోటేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


ఫ్యూజ్ బాక్సు తలుపులు సరి చేస్తున్న సిబ్బంది

మురళీనగర్: విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై 'సాక్షి'లో ప్రచురించిన కథనాలకు ఆ శాఖ అధికారులు స్పందించారు. ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఆదేశాల మేరకు మురళీనగర్ సబ్ స్టేషన్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు గోడను ఆనుకుని ఉన్న కరెంటు స్తంభంపై ఫ్యూజ్ బాక్సు తలుపులు తెరుచుకోవడమే కాకుండా బాక్సు తుప్పు పట్టడంతో ప్రమాదకరంగా మారింది. దీనిపై సాక్షిలో 'ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్సులు' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. ఈఈ ఆదేశాల మేరకు సిబ్బంది పార్కు గోడ వద్ద ఫ్యూజ్ బాక్సును సరి చేశారు.

**చెట్ల కొమ్మలు తొలగించారు** : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో చెట్ల కొమ్మలను తొలగించి వదిలేయడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'చెట్ల కొమ్మలు నరికారు.. తొలగించడం మరిచారు' పేరిట సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఈఈ ఆదేశాల మేరకు సిబ్బంది చెట్ల కొమ్మలను శుక్రవారమే తొలగించారు.

## రైల్వేస్టేషన్‌లో రూ. 1.4 లక్షల విలువైన గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలివి.. విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలలో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ధన్‌బాద్, ఝార్ఖండ్‌కు చెందిన పూర్ణిమాదేవి, ప్రియాంకరాయ్ విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా పూణే, మహారాష్ట్రలకు అక్రమంగా గంజాయి రవాణా చేయడం ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితులను జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా, వారి వద్ద నుండి రూ. 1.40 లక్షల విలువైన 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

## ముగిసిన లైబ్రేరియన్ల వర్క్‌షాప్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్ల వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో లైబ్రేరియన్లకు నేటి ఆధునిక ప్రపంచంలో గ్రంథాలయాల ఉపయోగాల గురించి తెలియజేశామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 38 మంది వివిధ ప్రభుత్వ కళాశాలలకు చెందిన గ్రంథాలయాధికారులు హాజరయ్యారని చెప్పారు. ఏయూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య ధనరాజు మాట్లాడుతూ ఆటోమేషన్ ఆవశ్యకత, ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ రిసోర్సెస్ వినియోగాన్ని తెలియజేశారు. ఆధునిక డిజిటల్ యుగంలో గ్రంథాలయ పాత్ర గురించి వివరించారు. కార్యక్రమ రిసోర్స్ పర్సన్లు గాంధీనగర్ అహ్మదాబాద్‌కు చెందిన సైంటిస్ట్ హేమ చోలిన్, ఆర్తి సవాలే మాట్లాడుతూ గ్రంథాలయాల డిజిటలైజేషన్‌లో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ గురించి పూర్తిస్థాయిలో గ్రంథాలయాధికారులకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణా డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్ వ్యవహరించారు. కళాశాల ఎకడమిక్ అడ్వైజర్ శ్రావణ్‌కుమార్, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.రవిబాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.